క్లుప్తంగా

వైభవంగా హనుమాన్ విగ్రహప్రతిష్ఠాపన



పూజలు చేస్తున్న భక్తులు

ఇంద్రవెల్లి: మండలంలోని అంజీ గ్రామ పంచాయతీ పరిధిలోని మామిడిగూడ గ్రామంలో నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠాపన, కలశ ఆవిష్కరణ వేడుకలను వైభవంగా నిర్వహించారు. గోద్మోలే భీంరావ్ మహరాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి, హనుమాన్ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. పట్నాపూర్ సిద్ధేశ్వర పూలాజీబాబా సంస్థన్ అధ్యక్షుడు ఇంగ్లే కేశావ్ హాజరై మాట్లాడారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కుడే కైలాస్, ముఖడే విష్ణు, కరాడే మారుతి, రాందాస్, ముఖడే ఉత్తం, ధన్‌జీ, పుంజరాం, కాలే గణపతి, కాలే సుదాం పాల్గొన్నారు.

మాలలు ఐక్యతతో ముందుకు సాగాలి



మాట్లాడుతున్న చెన్నయ్య

ఇచ్చోడ: మాలలు ఐక్యతతో ముందుకు సాగాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రానికి వచ్చిన సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. మాలలు తమ ఐక్యతతో హక్కుల సాధన కోసం పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. వర్గీకరణకు మాలలు అడ్డుకాదన్నారు. కానీ వర్గీకరణ శాస్త్రీయ పద్ధతిలో జరగాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం నాయకులు బొజ్జ లక్ష్మణ్, బత్తుల ఉశన్న, రాజ్‌కుమార్, మైల మహేశ్, బెల్లల రాజేశ్వర్, ఉపేంద్ర, అక్కెపెల్లి లస్మన్న, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత అలవర్చుకోవాలి

తాంసి: ప్రతిఒకరు ఆధ్మాత్మికత అలవర్చుకోవాలని సుందర చైతన్య శిష్యుడు శ్రీకృష్ణానంద శుక్రవారం కోరారు. భీంపూర్ మండలంలోని నిపానిలో ఐదు రోజులుగా శ్రీమద్రామాయణం (సుందరకాండ)పై శ్రీకృష్ణానంద స్వామి ప్రవచనాలు నిర్వహిస్తున్నారు. గ్రామస్తులకు, భక్తులకు స్వామి కృష్ణానంద సుందర కాండను ప్రవచనలు వివరించారు. గ్రామంలో భక్తిభావం పెంపొందించేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు గంగాధర్ రెడ్డి, సుగుణాకర్ రెడ్డి, గ్రామస్తులు రాజన్న, సంతోశ్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



టీకా వేస్తున్న పశువైద్యాధికారి

ఇచ్చోడ: మండలంలోని దేవుల్‌నాయక్‌తండా, రఘుగూడ గ్రామాల్లో శుక్రవారం పశువైద్యాధికారి గోవింద్‌నాయక్ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువైద్య శాఖ ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా ప్రతీ గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి, పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది, శేఖర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కుమురం భీంకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న గిరిజన నాయకులు

సిరికొండ: మండల కేంద్రంలో తుడుందెబ్బ, గిరిజన నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం కుమురం భీం వర్ధంతిని పురస్కరించుకొని ఘన నివాళులర్పించారు. మండల కేంద్రంలోని కుమురం భీం చౌక్‌లో భీం చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన గిరిజన జాతి కోసం చేసిన సేవలను, త్యాగాలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో తుడుందెబ్బ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బంద్ ప్రశాంతం

బోథ్: మండల కేంద్రంలో ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్ ప్రశాంతంగా సాగింది. పలువురు వ్యాపారస్తులు దుకాణాలను మూసి ఉంచారు. బంద్ నేపథ్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పాఠశాలలో వసతులు కరువు..!

- అసంపూర్తిగా వంటగది
- ఆరుబయటే వంటలు
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు

నార్నూర్: ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు మెరుగైన విద్యనందించేందుకు ప్రభుత్వం అన్నిరకాల వసతులు కల్పించడానికి 'అమ్మ ఆదర్శ కమిటి' పేరుతో కోట్లాది రుపాయాల నిధులు వెచ్చించి పనులు చేపడుతోంది. గత ప్రభుత్వం సైతం 'మన ఊరు.. మన బడి' పథకం కింద పనులు చేపట్టినా.. క్షేత్రస్థాయిలో పాఠశాలల పరిస్థితి ఏ మాత్రం మారలేదు. అధికారుల నిర్లక్ష్యంతో కాంట్రాక్టర్లు నాసిరకంగా పనులు చేపట్టి చేతులు దులుపుకున్నారు. పనులు సక్రమంగా జరగకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే దర్శనమిస్తున్నాయి. దీంతో విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు.

ఎక్కడి సమస్యలు అక్కడే..

గాదిగూడ మండలంలోని మేడిగూడ గ్రామంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఉంది. మొత్తం 120 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. గత ప్రభుత్వం మన ఊరు మన బడి పథకం కింద రూ. 9 లక్షల నిధులు విడుదల చేసింది. పాఠశాలలో విద్యుత్ సౌకర్యంతో పాటు తాగునీటి వసతి కల్పించాల్సి ఉంది. కానీ పనులు నాసిరకంగా చేపట్టడంతో అవి ఉపయోగంలో రాకుండా పోయాయి. పనులు చేపట్టిన ఆరు నెలలకే శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు తల్లిదండ్రులు కాంట్రాక్టర్ల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కాగా ఇప్పటి వరకు మొత్తం రూ. 5లక్షలు మాత్రమే ప్రభుత్వం బిల్లులు చెల్లించినట్లు సమాచారం.



అసంపూర్తిగా వంట గది



ఆరుబయటే వంట చేస్తున్న నిర్వాహకురాలు

అమ్మ ఆదర్శ కమిటీ ద్వారా ప్రస్తుత ప్రభుత్వం రూ. రెండు లక్షలు మాత్రమే మంజూరు చేసింది. ఈ నిధులతో తాగునీటి కోసం పైపులైన్ వేసినట్లు అధికారులు చెబుతున్నారు. పాఠశాలలో మొత్తం 120 మందికి మధ్యాహ్న భోజనం వంట చేయాల్సి ఉంటుంది. వంటగది గత మూడేళ్లుగా అసంపూర్తిగా ఉంది. మంజూరైనా నిధులు సైతం బిల్లుల రూపంలో డ్రా చేసినట్లు సమాచారం. వంటగది అసంపూర్తిగా ఉండడంతో మధ్యాహ్న భోజనం నిర్వాహకులు ఆరు బయటే వంట చేస్తున్నారు. కనీసం వంటగ్యాస్ కూడా లేదు. కట్టెల పొయ్యి మీద వంట చేస్తున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

గాదిగూడ మండలంలోని మేడిగూడ ఎంపీపీఎస్ పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. వంటగది పూర్తి చేసేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాను. విద్యార్థులు ఇబ్బంది పడకుండా పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటాం. – మనోహర్, ఎంఈవో గాదిగూడ

'రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలం'

ఆదిలాబాద్‌రూరల్: రాష్ట్రంలోని కాంగ్రెస్, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో పూర్తిగా విఫలం అయ్యాయని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ఆరోపించారు. శుక్రవారం మండలంలోని యాపల్‌గూడలో నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. రైతాంగ సమస్యలను పట్టించుకోని కాంగ్రెస్, బీజేపీ నాయకులు గ్రామాలలో పర్యటనకు వస్తే నిలదీయాలని పిలుపునిచ్చారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే, ఎంపీ బీజేపీ పార్టీకి చెందిన వారు ఉన్నప్పటికీ మూతపడిన సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ)ను పునరుద్ధరించే అంశం కేంద్రం పరిధిలో ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఈనెల 24న రైతుల పక్షాన చేపడుతున్న నిరసన సభకు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరు తెలిపారు. భారతదేశంలోనే నాణ్యత ప్రమాణాల్లో ఎంతో మెరుగైన ఆదిలాబాద్ పత్తి కొనుగోళ్లపై స్థానిక బీజేపీ నాయకులు నోరు మెదపడం లేదన్నారు. గుజరాత్ తరహాలో ఆదిలాబాద్ పత్తికి మంచి రేటు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ ఎంపీపీ గండ్రత్ రమేశ్, రోకండ్ల రమేశ్, ఇజ్జగిరి నారాయణ, పెందూర్ గంగయ్య, దుర్గం రాంచందర్, జయరాం, మామిళ్ల భూమన్న, పాలేపు అశోక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జోగు రామన్న

ఎస్సీ, ఎస్టీ చట్టం దుర్వినియోగం కాకుండా చూడాలి

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఉట్నూర్‌రూరల్: ఎస్సీ, ఎస్టీ చట్టం దుర్వినియోగం కాకుండా చూడాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ డివిజన్ స్థాయిలో సమావేశంలో పాల్గొని మాట్లాడారరు. ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు ప్రజలకు చట్టంపై అవగాహన పెంచాలన్నారు. అట్రాసిటీ కేసు నమోదైనప్పుడు బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. దుకాణాల్లో, వ్యాపారుల వద్ద కొందరు స్వార్థపరులు స్వలాభం కోసం ఎస్సీ ఎస్టీ చట్టాన్ని అడ్డం పెట్టుకొని బెదిరింపులకు గురి చేసే వారిని అరికట్టాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ నాగేంద్ర, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఆదిలాబాద్‌టౌన్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని నలంద కళాశాలలో డ్రగ్, సైబర్‌క్రైమ్, షీటీమ్ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, మత్తు పదార్థాలను సేవించడంతో ఆరోగ్యం క్షీణిస్తుందన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సెల్‌ఫోన్‌లలో వచ్చే లింక్‌లను ఓపెన్ చేయవద్దని, సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ మోసానికి గురైతే 1930కు సమాచారం ఇవ్వాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలుగుతూ అనుకున్న లక్ష్యాలను నెరవేర్చుకోవాలని ఆకాంక్షించారు. సమావేశంలో డీసీఆర్‌బీ డీఎస్పీ సురేందర్, నార్కొటిక్ డీఎస్పీ సోమనాథం, షీటీమ్ ఇన్‌చార్జి సుశీల, రియాజ్ ఖాన్, కళాశాల ప్రిన్సిపాల్ పున్నరావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయండి

ఎదులాపురం: హైదరాబాద్‌లో ఈనెల 25, 26వ తేదీల్లో నిర్వహించే వికలాంగుల హక్కుల జాతీయ వేదిక 4వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు మేస్రం నగేశ్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో శుక్రవారం కరపత్రాలను ఆవిష్కరించారు. మహాసభల్లో వికలాంగుల సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించడం జరుగుతుందని, జిల్లాలోని వికలాంగులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఇందులో జిల్లా కార్యదర్శి అరిఫాబేగం, జిల్లా సహాయ కార్యదర్శి కుమ్ర శత్రుఘున్, జిల్లా ఉపాధ్యక్షుడు వజ్రాల పోచన్న, జిల్లా కోశాధికారి అనసూయ, జిల్లా కమిటీ సభ్యులు మస్రత్ బేగం, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

నేరడిగొండకు చేరుకున్న బస్సుయాత్ర

నేరడిగొండ: ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో చేపట్టిన బస్సుయాత్ర శుక్రవారం నేరడిగొండ మండలానికి చేరుకుంది. సమితి ఉపాధ్యక్షుడు మద్దెల నారాయణ స్వామి నాయకత్వంలో బస్సు యాత్రికులకు స్వాగతం ఘన స్వాగతం పలికారు. ముందుగా వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి చైర్మన్ చెన్నయ్య అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నవంబర్ 24న హైదరాబాద్‌లో జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రమేశ్ కొక్కుల, మేకల మల్ల న్న, అడెల్లు, నారాయణస్వామి కుర్మే, రాజేశ్వర్ చిప్పరి, విశాల్, నవీన్, లక్ష్మణ్, ఎల్క రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చెన్నయ్య

కాంగ్రెస్‌లో 'ఇందిరమ్మ కమిటీ'ల చిచ్చు

- సీనియర్లకు ప్రాధాన్యమేదని ఆవేదన
- కష్టపడుతున్న వారికే చోటు కల్పించాలని డిమాండ్

బోథ్: ఇందిరమ్మ కమిటీలు కాంగ్రెస్ నాయకుల మధ్య చిచ్చు రేపుతోంది. పాత కాంగ్రెస్ నాయకులను కమిటీల్లో చోటు లభించకుండా చూస్తున్నారని సీనియర్ నాయకులు బహిరంగంగానే పేర్కొంటున్నారు. తమకు న్యాయం జరగకపోతే మంత్రి సీతక్కతో పాటు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌కు ఫిర్యాదు చేస్తామంటున్నారు. కాగా ఇప్పటికే కొత్త, పాత నాయకుల మధ్య సమన్వయం లేకపోవడంతో ఇందిరమ్మ కమిటీల్లో తమ వర్గానికి స్థానం కల్పించకపోవడంతో సీనియర్ నాయకులు భగ్గుమంటున్నారు. పార్టీ కోసం ఏళ్లుగా కష్టపడి పనిచేసిన నాయకులకే ఇందిరమ్మ కమిటీలో చోటు కల్పించాలని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లె పూల సత్యనారాయణ, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బూర్గుల మల్లేష్, నియోజకవర్గ సేవాదళ్ ఇన్‌చార్జి సల్ల రవిలు శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. కొంతమంది నాయకులు ప్రజల ముందు మాట్లాడలేని వారికి ఇందిరమ్మ కమిటీల్లో స్థానం కల్పించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ చేరి అసెంబ్లీ ఎన్నికల్లో వారికి మద్దతిచ్చిన వారు ప్రస్తుతం కాంగ్రెస్ చేరిన వారికి ఇందిరమ్మ కమిటీలో ఎలా చోటు కల్పిస్తారని మండిపడుతున్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

పరామర్శ



పరామర్శిస్తున్న కుమ్ర ఈశ్వరీబాయి

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని కొబ్బయ్‌గూడ గ్రామానికి చెందిన ఆశ కార్యకర్త కుంర దుర్పతబాయి ఇటీవల పాము కాటుతో మృతి చెందగా.. విషయం తెలుసుకున్న రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి శుక్రవారం కొబ్బయ్‌గూడ గ్రామానికి సందర్శించి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. పిల్లలను ఉన్నతంగా చదివించాలని, ఎలాంటి సమస్య వచ్చినా.. తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని పిల్లల తండ్రి సోనేరావ్‌కు హామీ ఇచ్చారు.

విగ్రహావిష్కరణ విజయవంతం చేయండి

ఇంద్రవెల్లి: మండలంలోని హీరాపూర్ గ్రామంలో ఈనెల 20న కుమురం భీం విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఆదివాసీ సంఘాల నాయకులు, ఆదివాసీ పెద్దలు తరలివచ్చి విజయవంతం చేయాలని తుడుందెబ్బ మండల అధ్యక్షుడు పుర్క చిత్రు కోరారు. శుక్రవారం మండలంలోని అమరవీరుల స్థూపం వద్ద విగ్రహావిష్కరణ కరపత్రాలు ఆవిష్కరించారు. జల్ జంగల్ జమీన్ నినాదంతో ఆదివాసీల హక్కుల కోసం నిజాం నిరంకుశ పాలనపై దండెత్తి పోరాడిన ఆదివాసీ అమరవీరుడు కుమురం భీం చరిత్ర ఆదివాసీ సమాజానికి స్ఫూర్తి అని , ఆయన పోరాట వలనే ఆదివాసీలకు హక్కులు దక్కాయన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు కొట్నాక్ బారిక్‌రావ్, గేడం భారత్, సోయం రాందాస్, సోయం మురారి, కుమ్ర భీంరావ్, కనక హనుమంత్‌రావ్, మెస్రం జైరాం పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

జోరుగా బీజేపీ సభ్యత్వ నమోదు



పరిశీలిస్తున్న పతంగె బ్రహ్మానందం

బోథ్: బోథ్ నియోజకవర్గ వ్యాప్తంగా బీజేపీ సభ్యత్వ నమోదు జోరుగా సాగుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగె బ్రహ్మానందం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సభ్యత్వ నమోదును పరిశీలించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బోరె రవీందర్, పీఏసీఎస్ చైర్మన్ కదం ప్రశాంత్, వెంకటేశ్, శేఖర్, రంజిత్, జుగాదిరావ్, విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేడు కార్యకర్తల సమావేశం

ఆదిలాబాద్‌రూరల్: బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని శనివారం ఆయా ఎంపీటీసీ స్థానాల పరిధిలోని గ్రామాల్లో నిర్వహించడం జరుగుతుందని మాజీ ఎంపీపీ గండ్రత్ రమేశ్ అన్నారు. శుక్రవారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గ్రామ కమిటీ, అనుబంధ కమిటీల అధ్యక్ష, కార్యదర్శులు, మాజీ ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరై సమావేశాలను విజయవంతం చేయాలని కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ఇంద్రానగర్‌లోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. శుక్రవారం పేకాట ఆడుతున్నట్లు పక్కా సమాచారం రావడంతో దాడులు నిర్వహించి పేకాటరాయుళ్లను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రూ.10,570 నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ నియోజకవర్గానికి కోట్లాది రూపాయలు నిధులు విడుదల చేయడంపై కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రజాసేవ భవన్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డితో పాటు ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క చొరవతో సీఆర్ఆర్ గ్రాంట్స్ రూ.10 కోట్లు, ఎస్‌డీఎఫ్ రూ.4 కోట్లు విడుదల కావడం హర్షణీయమన్నారు. ఆదిలాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి కంది శ్రీనివాస రెడ్డి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కంది నాయకత్వంలో ఆదిలాబాద్ నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధి సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు గిమ్మ సంతోష్, జహీర్ రంజాని, బండారి సతీష్, మునిగెల నర్సింగ్, కలాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

పకడ్బందీగా సర్వే చేపట్టాలి



వివరాలు పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజమోహన్

తలమడుగు: మండలంలో నిర్వహిస్తున్న ఎల్ఆర్ఎస్ భూసర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ రాజ్‌మోహన్ అన్నారు. శుక్రవారం మండలంలోని దేవాపూర్, కజ్జర్ల, తలమడుగు గ్రామాల్లో రెవెన్యూ సిబ్బంది నిర్వహిస్తున్న ఎల్ఆర్ఎస్ భూసర్వేను పరిశీలించారు. ఈసందర్భంగా రాజ్‌మోహన్ మాట్లాడుతూ.. ఎల్ఆర్ఎస్‌కు సంబంధించిన భూ వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అదే విధంగా భూములకు సంబంధించిన సమస్యలు ఉన్న వాటిని సమరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. భూములు కలిగిన అర్హులైన రైతులందరూ డిజిటల్ పట్టాపాస్ బుక్ పొందాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ, రోహిదాస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి వీడ్కోలు

బోథ్: కాలినడకన గ్రామానికి వచ్చి పాఠాలు చెప్పిన ఉపాధ్యాయుడు అనిల్‌కు మండలంలోని రాంనగర్ గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు. గత 12 ఏళ్లుగా రాంగనర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వర్తించిన అనిల్ ఇటీవల బదిలీ కావడంతో శుక్రవారం గ్రామస్తులు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. వర్షాకాంలో దాదాపు నాలుగు కిలోమీటర్ల మేర నడకదారిలో వచ్చి తమ పిల్లలకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయుడు అనిల్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి సుందర్ సింగ్, మాజీ సర్పంచ్ జగదీష్, ఉదల్ సింగ్, జోర్ సింగ్, అమర్ సింగ్, ప్రేమ్‌సింగ్, చరణ్ పాల్గొన్నారు.



ధన్యవాదాలు తెలుపుతున్న గ్రామస్తులు

ఆలయ అభివృద్ధికి కృషి

బేల: మహాంకాళి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పురాతన మహాంకాళి ఆలయాన్ని సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి నిధులు రూ.25 లక్షలు త్వరలో మంజూరయ్యేలా చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దత్తా నిక్కమ్, బోనిగిరివార్ గణేష్, ఇంద్రశేఖర్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

హెడ్‌కానిస్టేబుల్‌కు సన్మానం

ఆదిలాబాద్‌టౌన్: మైనర్ బాలిక అత్యాచారం కేసులో నేరస్తుడికి శిక్ష పడేలా సాక్షాధారాలు కోర్టుకు సమర్పించిన వన్‌టౌన్ హెడ్ కానిస్టేబుల్ రవీందర్ సింగ్‌ను ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి సన్మానించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

న్యాయమూర్తికి..

బోథ్: బోథ్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి హుస్సేన్ బదిలీపై వెళ్తున్న సందర్భంగా ఆయనను న్యాయవాదులు, కోర్టు సిబ్బంది శుక్రవారం శాలువాతో సత్కరించారు. మూడేళ్లపాటు న్యాయమూర్తిగా విధులు నిర్వర్తించిన న్యాయమూర్తి ఎంతో అన్యోన్యంగా ఉన్నారని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వామన్‌రావ్ దేశ్‌పాండే అన్నారు. ఏజీపీ పంద్రం శంకర్, న్యాయవాదులు సుభాష్, మోహన్ రావ్, అంగద్ కేంద్రే, రూపేందర్ సింగ్, హరీష్, విజయ్, ధమ్మపాల్, విక్రమ్, జమీర్, శరణ్య, సూపరింటెండెంట్ శేఖర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన ఉపాధ్యాయులకు..

బోథ్: మండలంలోని సొనాల గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలకు నూతనంగా వచ్చిన ఉపాధ్యాయులను పాఠశాల ఉపాధ్యాయ బృందం , సిబ్బంది, గ్రామస్తులు శుక్రవారం శాలువాతో సత్కరించారుడొంగరి వంశీకృష్ణ (మాథ్స్), సీహెచ్ చంద్రకాంత్(సోషల్) నేహా (ఫిజిక్స్) ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా ఏ.పుష్పల, ఎస్జీటీలు భారతి, వరలక్ష్మిలను సత్కరించారు.

పంటలపై అడవిపందుల దాడులు

నేరడిగొండ: ఆరుగాలం శ్రమించి సాగు చేస్తున్న పంటలకు అడవి పందుల బెడద తప్పడం లేదు. మండలంలోని కుమారి గ్రామానికి చెందిన రైతు వొర్స రాజేందర్ వ్యవసాయ క్షేత్రంలో శుక్రవారం పందులు స్వైర విహారం చేశాయి. దీంతో మూడు ఎకరాల్లో పత్తి పంట నష్టపోయినట్లు బాధిత రైతు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.